సాక్షి జగిత్యాల

గురువారం । 23 । ఫిబ్రవరి । 2023



కల్యాణం.. కమనీయం

ధర్మపురి: శ్రీమద్విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి కల్యాణం బుధవారం వైభవంగా జరిపించారు.



మంచిర్యాలలో మనరైతులు

ధర్మపురి: ఆయిల్‌పామ్ సాగులో మెలకువలు తెలుసుకునేందుకు కొస్నూర్‌పల్లె రైతులు మంచిర్యాల జిల్లా గూడెం తరలివెళ్లారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
36.0/18.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం తక్కువగా నమోదు అవుతుంది. పగటిపూట ఎండగా ఉంటుంది.

న్యూస్‌రీల్

వార్డు సభ్యుడి రాజీనామా



రాజీనామా పత్రం అందిస్తున్న లింగారెడ్డి

కథలాపూర్(వేములవాడ): భూషణరావుపేట గ్రామపంచాయతీ ఒకటో వార్డుసభ్యుడు మామిడిపెల్లి లింగారెడ్డి తన పదవికి రాజీనామా చేస్తూ బుధవారం ఎంపీడీవో జనార్దన్‌కు లేఖ అందజేశారు. నిధుల వివరాలు తనకు తెలపడంలేదని, కనీసం అభివృద్ధి పనుల వివరాల గురించి వార్డుసభ్యుడిగా తనకు తెలియని పరిస్థితి నెలకొందని వాపోయారు. ప్రొటోకాల్ ప్రకారం ఏ కార్యక్రమానికీ ఆహ్వానం అందడం లేదని పేర్కొన్నారు. అందుకే తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఆయన వివరించారు.

వేములకుర్తిలో విచారణ



వివరాలు సేకరిస్తున్న అధికారులు

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): తమ గ్రామ సర్పంచ్ భర్త వేధిస్తున్నాడని వేములకుర్తికి చెందిన కొందరు గత సోమవారం ప్రజావాణి ద్వారా అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అదనపు కలెక్టర్ మకరంద ఆదేశాల మేరకు ఎంపీడీవో ప్రభు, తహసీల్దార్ మహేశ్వర్ బుధవారం గ్రామానికి చేరుకున్నారు. ఫిర్యాదుదారులతోపాటు సర్పంచ్ భర్త సున్నం సత్యం, గ్రామస్తుల నుంచి వాంగ్మూలాలు సేకరించారు. నివేదికను కలెక్టర్‌కు అందిస్తామని ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో కృపాకర్, సర్పంచ్ సున్నం నవ్యశ్రీ, ఫిర్యాదుదారులు తదితరులు పాల్గొన్నారు.

సేవ చేయడంపై దృష్టి



పెళ్లి సామగ్రి అందిస్తున్న దావ వసంత

జగిత్యాలజోన్: మున్నూరుకాపు కులస్తులు సేవ చేయడంపై దృష్టి సారించాలని జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత కోరారు. పట్టణానికి చెందిన కట్టంగూర్ రవీందర్–లక్ష్మీ దంపతుల కూతురు జ్యోత్స్న వివాహం ఈనెల 24న జరుగనుంది. ఆమెకు బుధవారం సంఘం ఆధ్వర్యంలో పెళ్లి సామగ్రిని వసంత అందజేసి మాట్లాడారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న మున్నూరుకాపులు తమ సమస్యను సంఘం దృష్టికి తీసుకురావాలన్నారు. సంఘం తరఫున తగిన సాయం అందిస్తామని చెప్పారు. మున్నూరుకాపు సంఘానికి అండగా ఉంటామని అభయం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు బాదినేని రాజేందర్, కౌన్సిలర్ తోట మల్లికార్జున్, నాయకులు బండారి రాజ్‌కుమార్, చుక్క నవీన్, బండారి నరేందర్, దీటి అంజయ్య, రంగు గోపాల్, తిరుపతి, రవీందర్, మల్లారెడ్డి, అంజన్న పాల్గొన్నారు.

కెపాసిటర్లు బిగించాలి



ట్రాన్స్‌కో ఏడీ హరీశ్‌తో రైతులు

రాయికల్(జగిత్యాల): రైతులు తమ వ్యవసాయ మోటార్లకు కెపాసిటర్లు బిగించుకోవాలని ట్రాన్స్‌కో ఏడీ హరీశ్ సూచించారు. కెపాసిటర్ల బిగింపు ద్వారా కలిగే ప్రయోజనాల గురించి బుధవారం ఇటిక్యాల గ్రామంలో రైతులకు వివరించారు. కెపాసిటర్ల బిగింపుతో ట్రాన్స్‌ఫార్మర్లపై లోడు తగ్గుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ రాజేశ్, రైతు సంఘ నాయకులు స్వామిరెడ్డి, శ్రీనివాస్, రమేశ్, లింగన్న, మధు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలు

జగిత్యాల: అభివృద్ధి చెందిన దేశాల్లో నైపుణ్యం గల కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సత్తమ్మ తెలిపారు. ఈమేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అనుభవం గల ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, జేసీబీ డ్రైవర్, మెకానిక్, సూపర్‌వైజర్ ఉద్యోగాల కోసం అభివృద్ధి చెందిన దేశాల్లో డిమాండ్ ఉందని పేర్కొన్నారు. రిక్రూట్‌మెంట్ ప్రక్రియను సులభతరం చేయడంలో టామ్‌కమ్ సాయం చేస్తుందని తెలిపారు. నిరుద్యోగులు సంబంధిత ఫార్మాట్‌లో తమ పేర్లు, సమగ్ర వివరాలు ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. ఆసక్తి గలవారు టామ్‌కామ్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సత్తమ్మ ఆ ప్రకటనలో సూచించారు.

పల్లెల నుంచి పట్టణాలకు..



ఇతడు బీర్‌పూర్ మండలం నర్సింహుల పల్లికి చెందిన దోసారపు బక్కన్న. వీళ్ల గ్రామంలో 11 మందిని కుక్కలు కరిచాయి. బక్కన్న తీవ్రంగా గాయపడగా సారంగాపూర్ మండలంలోని పీహెచ్‌సీలో చికిత్స పొందాడు. బీర్‌పూర్ మండలంలో పీహెచ్‌సీ లేకపోవడంతో దూరంలో ఉన్న సారంగాపూర్‌కు రావాల్సి వచ్చింది. అక్కడ రేబిస్ వ్యాక్సిన్ వేసుకున్నాడు. 11 మంది ఇక్కడికే వచ్చి టీకా తీసుకున్నారు.

- గ్రామాల్లో ఆహారం కొరత
- వలసబాట పట్టిన వీధికుక్కలు
- పట్టణాలు, మండల కేంద్రాల్లో మకాం
- చికెన్, మటన్, చేపల మార్కెట్లలో అడ్డా
- వీధుల్లోనూ వ్యర్థాలపై ఆధారం
- గుంపులుగా స్వైరవిహారం
- ప్రజలు, మూగజీవాలపై దాడులు
- జంకుతున్న జిల్లావాసులు

జగిత్యాలలో కుక్కకాటుకు గురైనవారు	
2021-22	2,690
2022-23	1,252

జిల్లాలోని పలు పల్లెల్లో వీధికుక్కలకు ఆహారం కొరత ఎదురవుతోంది. దీంతో ఆహార అన్వేషణలో సమీప పట్టణాలు, మండల కేంద్రాలు, మేజర్ గ్రామపంచాయతీలకు వలస వెళ్తున్నాయి. అక్కడి చికెన్, మటన్ సెంటర్లు, చేపల మార్కెట్లను ఆవాసాలుగా మార్చుకుంటూ ఆకలి తీర్చుకుంటున్నాయి. అంతేకాదు.. ఇళ్లలో మిగిలిపోయిన ఆహార పదార్థాలపై కూడా ఆధారపడుతున్నాయి. హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, కల్యాణ మండపాల ప్రాంతాల్లోనూ నిత్యం సంచరిస్తున్నాయి. ఈక్రమంలో గుంపుగుంపులుగా తిరుగుతూ కనిపించినవారిపై దాడులకు తెగబడుతున్నాయి. ఒక్క జిల్లాకేంద్రంలోనే రోజూ కనీసం 10మంది – 15మంది వీటి బారిన పడి ఆస్పత్రుల పాలవుతున్నారంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.



జిల్లా కేంద్రంలోని అశోక్‌నగర్‌లో ఆస్పత్రుల వద్ద కుక్కల గుంపు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని టవర్ సర్కిల్, సార్గమ్మ సంధి, అన్నపూర్ణ చౌరస్తా, కృష్ణానగర్, విద్యానగర్‌తోపాటు పలు కాలనీల్లోని అంతర్గత రహదారులు అడ్డాగా వీధికుక్కలు గుంపులుగా సంచరిస్తున్నాయి. వీటి సంఖ్య సుమారు 8వేల వరకు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. కనిపించిన వారిపై ఇవి దాడులు చేస్తున్నాయి. రోజూ కనీసం 15 మంది వీధికుక్కల బారినపడుతున్నారని అంచనా. వీటిని పట్టుకుని సురక్షిత ప్రాంతాలకు తీసుకెళ్లేందుకు ఆంధ్రాలోని పిఠాపురం నుంచి సిబ్బందిని మున్సిపల్ అధికారులు తీసుకొచ్చారు. వాటిని పట్టుకుని దూర ప్రాంతాలకు తరలించారు. ఇందుకోసం అప్పట్లో రూ.5లక్షలు కేటాయించారు. ఇప్పుడా ఊసేలేదు. అయితే, కుక్కకాటుకు అన్ని ఆస్పత్రుల్లో యాంటి రేబిస్ వ్యాక్సిన్ అందుబాటులో ఉంది.

కార్యరూపం దాల్చని నియంత్రణ

వీధికుక్కల నియంత్రణకు జగిత్యాలలో జంతు సంరక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ నిర్ణయించి రూ.30లక్షలు కేటాయించింది. టీఆర్‌నగర్‌లో భవన నిర్మాణం చేపట్టినా ఇంకా పూర్తికాలేదు. భవనం అందుబాటులోకి వస్తే వీధికుక్కలకు శస్త్ర చికిత్స చేసి సంతానం నియంత్రించే అవకాశం ఉందని భావిస్తున్నారు.



ఈయన పేరు యామ రాజయ్య. మెట్‌పల్లి బల్దియా రెండోవార్డు కౌన్సిలర్. పని నిమిత్తం ద్విచక్రవాహనంపై ఇటీవల ఇంటినుంచి బయటకు వెళ్లారు. వార్డులో కొద్దిదూరం వెళ్లాక వీధికుక్కలు వెంటపడి దాడిచేశాయి. తీవ్రంగా గాయపడి ఆస్పత్రి పాలయ్యారు. కోలుకున్నాక.. మున్సిపల్ సమావేశంలో పలుమార్లు వీధికుక్కల బెడద గురించి ప్రస్తావించారు. నేటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు.



నిర్మాణ దశ దాటని జంతు సంరక్షణ కేంద్ర భవనం

జనావాసాలకు దూరంగా తరలిస్తాం

వీధికుక్కల సంఖ్య అధికంగా ఉంది. ఫిర్యాదులు వచ్చిన వెంటనే వాటిని పట్టుకుంటాం. జనావాసాలకు దూరంగా, సురక్షిత ప్రాంతాలకు తరలిస్తాం. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూస్తాం.

– ఎల్లం, శానిటరీ ఇన్‌స్పెక్టర్, జగిత్యాల

అడుగడుగునా భయమే..



ప్రకాశం రోడ్డులో వీధికుక్కలు

కోరుట్ల: మున్సిపల్‌లో వీధికుక్కలు ప్రజలను వెంటాడుతున్నాయి. వివిధ పనుల కోసం ఇళ్లనుంచి బయటకు వెళ్తున్నవారిని, బయటి నుంచి ఇళ్లకు వస్తున్నవారిని లక్ష్యంగా కరుస్తున్నాయి.

- మూడు నెలల క్రితం కోరుట్ల రహమత్‌పురాలో ఓ కుక్క చిన్నారిని కరవడంతో ఆస్పత్రి పాలయ్యాడు.
- నెలక్రితం బిలాల్‌పురాలోనూ ఓ వృద్ధురాలిపై కుక్కలు దాడిచేశాయి.
- ప్రకాశం రోడ్డు, లక్ష్మీటాకీస్ ఏరియా, బిలాల్‌పురా, రహమాత్‌పురా, కటికెవాడ, బీమునిదుబ్బ, ఏకలవ్యనగర్, రథాల పంపు, బురుజు మార్కెట్ ఏరియాల్లో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉంది.
- మొత్తం 33వార్డులు ఉండగా ఒక్కో వార్డులో సుమారు 50–80 వరకు వీధికుక్కలు ఉన్నట్లు మున్సిపల్ వర్గాల అంచనా.

నియంత్రిస్తాం



వీధికుక్కల నియంత్రణకు బర్త్ కంట్రోల్‌తోపాటు జిల్లాకు జంతు సంరక్షణ కేంద్రం ప్రతిపాదించారు. ఆ మేరకు అవసరమైన చర్యలు తీసుకుంటాం.

– ఆయాజ్, మున్సిపల్ కమిషనర్, కోరుట్ల

మూడు నెలల్లో 130 మందిపై దాడి

రాయికల్(జగిత్యాల): మున్సిపల్ పరిధిలో గత మూడునెలల వ్యవధిలో సుమారు 130 మంది కుక్కకాటుకు గురైనట్లు స్థానిక ఆస్పత్రి సూపరింటెండెంట్ రవి తెలిపారు. ఇటిక్యాల క్రాసింగ్, గాంధీచౌక్, శివాజీ ఏరియా, మాదిగకుంట ప్రాంతాల్లో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. ప్రజలే కాదు.. మూగజీవాలపై దాడిచేస్తున్న కుక్కలు.. గొర్రెలు, మేకల కాపరులకు ఆర్థికంగా నష్టం చేకూర్చుతున్నాయి. పట్టణంలో సుమారు 300లకు పైగా వీధికుక్కలు ఉన్నట్లు మున్సిపల్ అధికారులు అంచనా వేశారు. వీటిని పట్టి మరోచోటికి తరలించినా రెండుమూడ్రోజులకే మళ్లీ వచ్చాయని మున్సిపల్‌వాసులు చెబుతున్నారు. చికెన్, మటన్ సెంటర్ల నుంచి వెలువడే వ్యర్థాలు, ఇళ్లలో మిగిలిన పదార్థాలను తిని బతుకుతున్నాయి.



ఓ కాలనీలో వీధికుక్కల సంచారం

కుక్కల బెడద ఉంది



మా పట్టణంలో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. వాటి దాడిలో పలువురు చిన్నారులు గాయపడ్డారు. రాత్రిపూట రాకపోకలు సాగించడం భయంగా ఉంది.

– రాజేశ్, రాయికల్

చర్యలు తీసుకుంటున్నాం



మున్సిపల్ పరిధిలో వీధికుక్కల సంఖ్య పెరుగుతోంది. వాటితో పట్టణవాసులు ఇబ్బందులు పడుతున్నారు. వీధికుక్కలను పట్టుకుని ఇతర ప్రాంతాలకు తరలించేలా చర్యలు చేపడుతున్నాం. వాటి ఉత్పత్తి నిలిచిపోయేందుకు శస్త్రచికిత్స చేసేలా ప్రణాళిక రూపొందిస్తున్నాం.

– సంతోష్‌కుమార్, మున్సిపల్ కమిషనర్, రాయికల్

నియంత్రణ కరువు



వీధికుక్కల బారినుంచి కాపాడాలని మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న ధర్మపురి బల్దియా కౌన్సిలర్లు

ధర్మపురి: మున్సిపల్ పరిధిలో సుమారు వందకుపైగా వీధికుక్కలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. 2022 డిసెంబర్ నుంచి 2023 జనవరి వరకు 549 మందిపై దాడిచేసి గాయపరిచాయి. 2023 జనవరి నుంచి ఈనెలలో ఇప్పటివరకు 115 మందిని కరిచినట్లు ప్రభుత్వ వైద్యాధికారులు తెలిపారు. వీధికుక్కల బారినుంచి తమను, ప్రజలను కాపాడాలని సాక్షాత్తు మున్సిపల్ కౌన్సిలర్లు అధికారులకు మొరపెట్టుకున్నా ప్రయోజనం లేకుండా పోతోంది. ప్రజాప్రతినిధుల పరిస్థితే ఇలా ఉంటే.. ఇక సామాన్యుల దుస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

మెట్‌పల్లిలో వ్యర్థాలు తింటున్న వీధికుక్కలు



చర్యలు శూన్యం

మెట్‌పల్లి(కోరుట్ల): పట్టణంలో సుమారు 500పైగానే వీధికుక్కలు ఉన్నట్లు అధికారులు అంచనా వేశారు.

- స్థానికులు వేసే ఆహారంతోపాటు బహిరంగ ప్రదేశాల్లోని వ్యర్థాలను ఇవి ఆహారంగా తీసుకుంటున్నాయి.
- రేగుంటలోని తన ఇంటి ఎదుట నిద్రిస్తున్న వృద్ధుడిపై గతంలో వీధికుక్కలు దాడిచేసి తీవ్రగా గాయపర్చాయి. తీవ్రగాయాలతో వృద్ధుడు మరణించడం పరిస్థితి తీవ్రతకు అద్దంపడుతోంది.
- ఈనెలలో ఇప్పటివరకు 86మంది వీధికుక్కల బారినపడి ఆస్పత్రి పాలైనట్లు గణాంకాలు చెబుతున్నాయి.
- మూడేళ్ల క్రితం మున్సిపల్ ఆధ్వర్యంలో వీధికుక్కలను పట్టుకొని ఆదిలాబాద్ జిల్లా అడవుల్లో విడిచిపెట్టారు.
- అప్పట్నుంచి ఇప్పటిదాకా నియంత్రణ చర్యలు తీసుకోవడంలేదు.

ఫిర్యాదులు వస్తున్నాయి..



వీధికుక్కల సమస్యపై ఫిర్యాదులు వస్తున్నాయి. వీటి నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యల గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. వారి సూచనల కనుగుణంగా తదుపరి చర్యలు తీసుకుంటాం.

– రాజ్‌కుమార్, ఇన్‌చార్జి కమిషనర్, మెట్‌పల్లి

పాలకమండలి నోటిఫికేషన్ ఎప్పుడో?

- మరో అవకాశం ఇవ్వాలంటున్న మాజీలు
- చొప్పదండి ఎమ్మెల్యే చుట్టూ ప్రదక్షిణలు

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి ఆలయ ట్రస్టు బోర్డు గడువు ఈనెల 12వ తేదీతో ముగిసింది. పాలక మండలిలో మొత్తం 14మంది సభ్యులు ఉన్నారు. ఇందులో గన్ను శ్రీనివాస్‌రెడ్డి, గొల్లపల్లి శ్రవణ్‌కుమార్, పుల్కం నర్సయ్య, ఉప్పుల గంగాధర్, బండపెల్లి యాదగిరి, దాసరి రాజేందర్‌రెడ్డి, జన్న సురేందర్, పోచమల్ల ప్రవీణ్‌కుమార్, కొంక నర్సయ్య, బోడ్ల సతీశ్, వోల్లాల లింగాగౌడ్, బెంద్రం మాధవరెడ్డి, ముద్దం రవి సభ్యులు కాగా, ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ప్రధాన అర్చకుడు తిరుకోవెల జితేంద్రప్రసాద్‌ను కమిటీగా నియమించారు. ఈ కమిటీ పాలకవర్గం గడువు ముగిసింది. ప్రస్తుత చైర్మన్ మారుతీస్వామి ఆ పదవిలో మరోఏడాదిపాటు కొనసాగుతారు.

మరోసారి అవకాశం కోసం..

- పాత పాలకవర్గ సభ్యులు తమకు మరోసారి అవకాశం కల్పించాలని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ చుట్టూ నిత్యం ప్రదక్షిణలు చేస్తున్నారు.
- ఇటీవల సీఎం కేసీఆర్ కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దర్శనం కోసం వచ్చారు. ఆయనతోపాటే దేవాదాయ, ధర్మాదాయ కమిషనర్ అనిల్‌కుమార్ కూడా వచ్చారు.
- పాత కమిటీలోని ఓ సభ్యుడు.. తన పదవీ కాలాన్ని రెన్యూవల్ చేయాలని విన్నవించారని, అయితే, స్థానిక ఎమ్మెల్యే సిఫారసు చేస్తే తక్షణమే రెన్యూవల్ చేస్తామని అనిల్‌కుమార్ అభయం ఇచ్చినట్లు సమాచారం.
- అయితే, కొందరు సభ్యుల పనితీరుపై అసంతృప్తిగా ఉన్న ఎమ్మెల్యే.. వారిని మళ్లీ కమిటీలోకి తీసుకునేందుకు సానుకూలంగా స్పందిస్తారా? లేదా? అనే అనుమానాలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి.
- ఒకవేళ వారిని కాదని మిగతా వారి పదవులు రెన్యూవల్ చేస్తే.. అందుకు జీవోలోని నిబంధనలు అంగీకరించవని అధికారులు, నిపుణులు అంటున్నారు.
- పాలక మండలిని పునరుద్ధరించాల్సి వస్తే.. మొత్తం సభ్యులతో ఉన్న కమిటీని రెవన్యూవల్ చేయాల్సి ఉంటుందని అంటున్నారు.
- అయితే, ఇప్పుడున్న కమిటీ భక్తులకు చెప్పుకోదగనంతగా సేవలు ఏమీ అందించలేదని, పైగా ఆలయంపై అదనపు ఆర్థికభారం పడిందనే ఆరోపణలు వస్తున్నాయి.
- పాలకవర్గం నియామకంపై ప్రభుత్వం కొత్త నోటిఫికేషన్ జారీచేస్తుందా? పాత పాలకమండలిని పునరుద్ధరిస్తుందా?అనే విషయంపై రెండురోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉంది.



కొండగట్టు ఆలయం

బీఆర్‌ఎస్‌కు చరమగీతం



మాట్లాడుతున్న తుల ఉమ

కథలాపూర్(వేములవాడ): బంగారు తెలంగాణ అంటూ అవినీతి పాలన కొనసాగిస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ప్రజలు చరమగీతం పాడాలని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్, బీజేపీ రాష్ట్ర నాయకురాలు తుల ఉమ కోరారు. బుధవారం రాత్రి భూషణరావుపేటలో ప్రజా గోస బీజేపీ భరోసా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని చెప్పి 8 ఏళ్లుగా పబ్బం గడుపుతున్నారని మండిపడ్డారు. బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, నాయకులు ఎద్మల వినోద్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కంటి సత్యనారాయణ, నాయకులు పల్లె గంగాధర్, గాంధారి శ్రీనివాస్, మహేశ్, ప్రతాప్‌రెడ్డి, గజబీంకార్ ప్రవీణ్, ఉమేశ్ పాల్గొన్నారు.

అసాంఘిక శక్తుల కట్టడి లక్ష్యం

- ఎస్పీ భాస్కర్

జగిత్యాలక్రైం: అసాంఘిక శక్తులు, అనుమానితులను కట్టడి చేయడమే లక్ష్యంగా జిల్లావ్యాప్తంగా నాకాబందీ చేపట్టామని ఎస్పీ భాస్కర్ అన్నారు. బుధవారం మధ్యాహ్నం 2– సాయంత్రం 5గంటల వరకు జిల్లాకేంద్రంలో వాహనాల తనిఖీ చేపట్టారు. జగిత్యాలకు వచ్చే అన్నిదారుల్లో పోలీస్ అధికారులు, సిబ్బంది బృందాలుగా ఏర్పడి ఏకకాలంలో సోదాలు చేశారు. సుమారు వెయ్యి వాహనాలు తనిఖీ చేసినట్లు అధికారులు తెలిపారు. ధ్రువీకరణపత్రాలు, నంబరు ప్లేట్లులేని 167 వాహనాలు సీజ్ చేశారు. కొందరు అనుమానితులను పరశ్నించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ, జిల్లాలో అనూహ్య సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తుగా నాకాబందీ చేపట్టి, ప్రజల్లో భద్రతాభావం కల్పిస్తున్నామన్నారు. అనుమానితుల గురించిన సమాచారాన్ని సమీప పోలీసుస్టేషన్‌కు చేరవేయాలని, డయల్ 100 నంబరు ద్వారా కూడా చేరవేస్తే తక్షణ చర్యలు చేపడతామని తెలిపారు. తనిఖీలతో నేరాల సంఖ్య తగ్గుముఖం పట్టి ప్రజలకు మరింత రక్షణ కల్పించే వీలు ఉంటుందని వివరించారు. కొందరు వాహనదారులు ఈ చలాన్ నుంచి తప్పించుకోవడం కోసం తప్పుడు నంబర్లు రాస్తున్నారని, వివిధ ఆకారాల్లో నంబరు ప్లేట్లు బిగించుకుంటున్నారని, ఇవి నిబంధనలు విరుద్ధమని స్పష్టం చేశారు. ఇలాంటివారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. సీఐలు కిశోర్, ఆరిఫ్ అలీఖాన్, రమణమూర్తి, లక్ష్మీనారాయణ, ప్రవీణ్‌కుమార్, ఎస్సైలు, హెడ్‌కానిస్టేబుల్, కానిస్టేబుళ్లు, హోంగార్డులు తదితరులు పాల్గొన్నారు.



వాహనంలో తనిఖీ చేస్తున్న పోలీసులు

ఎంపీ, ఎమ్మెల్యేకు గుణపాఠం తప్పదు

- చక్కెర ఫ్యాకర్టీ తెరిపించాలి
- పీసీసీ డెలిగేట్ జువ్వాడి నర్సింగరావు
- నిజాం చక్కెర కర్మాగారం ఎదుట ధర్నా

మల్లాపూర్(కోరుట్ల): నిజాం చక్కెర పరిశ్రమను వెంటనే పునరుద్ధరించాలని పీసీసీ డెలిగేట్ జువ్వాడి నర్సింగరావు, నాయకుడు జువ్వాడి కృష్ణారావు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ శ్రేణులు, చెరుకురైతులతో కలిసి చిట్టాపూర్ నుంచి నిజాం షుగర్ ఫ్యాక్టరీ వరకు బుధవారం పాదయాత్ర చేపట్టారు. పరిశ్రమ ఎదుట ధర్నా చేశారు. నర్సింగరావు, కృష్ణారావు మాట్లాడారు. తాము అధికారంలోకి వస్తే 100రోజుల్లోనే నిజాం షుగర్ ఫ్యాక్టరీలు స్వాధీనం చేసుకుంటామన్న టీఆర్‌ఎస్, ఎంపీగా గెలిస్తే సొంత డబ్బు వెచ్చించి ఫ్యాక్టరీని నడుపతామన్న బీజేపీ ఎంపీ అర్వింద్ తమ హామీలు విస్మరించడం దారుణమన్నారు. వారికి వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఇకనుంచి ప్రతినెలా 22న ఒక్కో గ్రామం నుంచి షుగర్ ఫ్యాక్టరీ వరకు పాదయాత్ర నిర్వహిస్తామని, ఈప్రక్రియ వచ్చే డిసెంబర్ వరకు కొనసాగుతుందని వెల్లడించారు. అనంతరం సీఎం కేసీఆర్, ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు దిష్టిబొమ్మలు దహనం చేశారు. నాయకులు మామిడి నారాయణరెడ్డి, కంది బుచ్చిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సాయికుమార్, రాజిరెడ్డి, ప్రణయ్‌గౌడ్, శేఖర్‌రెడ్డి, శ్రీనివాస్, భూమక్క, లింగారెడ్డి, రాజేశం, అరుణ్‌రెడ్డి ఉన్నారు.



ధర్నా చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే, జెడ్పీ చైర్‌పర్సన్



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే

జగిత్యాల: కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన షేక్ యాస్మిన్‌బాషాను జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం జిల్లా అభివృద్ధిపై చర్చించారు.

రైతు కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం చేస్తున్న నాయకులు

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన నిరుపేద రైతు గడ్డం జలపతిరెడ్డి తన ఇద్దరు కుమార్తెలతో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. కాగా వారిది నిరుపేద కుటుంబం కావడంతో స్పందించిన మెట్‌పల్లి డివిజన్ రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు రూ.1.65 లక్షలు బుధవారం అతడి కుమార్తె జస్మిత, భార్య కవితకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మోహన్‌రెడ్డి, తిరుపతి, మాదవ్, శ్రీనివాస్, రవిరెడ్డి, వెంకట్, అనిల్, దుర్గప్రసాద్ పాల్గొన్నారు.

బహుజన రాజ్యంలోనే అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న నాయకులు

జగిత్యాల: రాష్ట్రం అభివృద్ధి బాటలో నడవాలంటే బహుజన రాజ్యంలోనే సాధ్యమవుతుందని వంచిత్ బహుజన అగాడి రాష్ట్ర కోఆర్డినేటర్ బండి విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. తెలంగాణలో బహుజనులు ఎక్కువగా ఉన్నారని, సంవత్సరాలు గడుస్తున్నా అభివృద్ధి లేదన్నారు. మహారాష్ట్రలో శివసేనలో పొత్తు కొనసాగిస్తామని, తెలంగాణలో ఒంటరిగా పోటీ చేస్తామని పేర్కొన్నారు. 60 సీట్లలో వీబీఏ అభ్యర్థులను బరిలో దింపుతామన్నారు. ఆయన వెంట శ్రీకాంత్, శేఖర్, భూంరాజ్ ఉన్నారు.

వైన్ షాపులో చోరీ



వైన్స్ వద్ద సంచరిస్తున్న దొంగలు(సీసీ కెమెరా ఫుటేజీ)

వెల్గటూర్(ధర్మపురి): అర్ధరాత్రి పూట వైన్ షాప్‌లో దొంగలుపడి దోచుకుపోయిన ఘటన వెలటూర్ మండల కేంద్రంలో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు.. మండల కేంద్రంలోని మహాలక్ష్మీ వైన్స్‌లో మంగళవారం రాత్రి 11:30 సమయంలో ముగ్గురు దొంగలు షట్టర్ తాళాలు పగులగొట్టారు. కౌంటర్‌లోని రూ.5 వేలు, రూ.13 వేల విలువ గల మద్య బాటిళ్లు ఎత్తుకెళ్లారు. అడ్డుపడిన వాచ్‌మెన్ కొత్తపల్లి మల్లయ్యను రాడ్‌తో తలపై కొట్టి తీవ్రంగా గాయపరిచారు. వైన్స్‌లో సేల్స్ మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్న దాసరి లింగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు.

దోసకాయ కేరాఫ్ 'మ్యాడంపల్లి'

- నాణ్యతతో పాటు తాజాగా ఉండటంతో మార్కెట్‌లో డిమాండ్
- నేరుగా వినియోగదారులకే అమ్మకం



జగిత్యాలలో దోసకాయలు విక్రయిస్తున్న మ్యాడంపల్లి రైతులు

జగిత్యాలఅగ్రికల్చర్: చాలా గ్రామాల్లో రైతులు వరి, మొక్కజొన్న వంటి పంటలు సాగు చేస్తే.. జిల్లాలోని మ్యాడంపల్లి గ్రామ రైతులు మాత్రం సాధారణ పంటలతో పాటు స్వల్పకాలంలో ఆదాయం వచ్చే దోసకాయల పంటను సాగు చేస్తున్నారు. వేసవిలో డిమాండ్ ఉండే సన్నని దోస సాగు చేస్తూ, నేరుగా వినియోగదారులకే అమ్ముతూ మంచి ఆదాయం పొందుతున్నారు.

వినూత్న తరహాలో..

మ్యాడంపల్లిలో దాదాపు 50 శాతం మంది రైతులు 100 ఎకరాల వరకు వేసవి పంటగా దోసను సాగు చేస్తుంటారు. దోసకాయల్లో చాల రకాలు ఉండగా, సన్నగా, పొడవు, గింజలు లేని రకాలను ఒక్కో రైతు కనీసం 10 గుంటల నుంచి అర ఎకరం వరకు సాగు చేస్తారు. వానాకాలంలో వరి లేదా మొక్కజొన్న వేసిన రైతులు, రెండో(వేసవి) పంటగా దోస సాగు చేస్తారు. విత్తనాలను మార్కెట్ నుంచి కొనుగోలు చేయకుండా గతేడాది సాగు చేసిన దోసకాయల్లో మంచి నాణ్యత గల కాయలను ఎంచుకుని వాటి నుంచి విత్తనాలు తయారు చేస్తారు. నాణ్యమైన విత్తనాలకు బూడిద కలిపి, వారం పాటు ఎండబెట్టి తర్వాత కవర్లో సీజన్ వరకు భద్రపరుస్తారు. డిసెంబర్ చివరి లేదా జనవరి మొదటి వారంలో బోజలు లేదా మడుల పద్ధతిలో విత్తనాలు నాటుతారు. అవి మొలిచిన తర్వాత 10 రోజులకు బూడిద చల్లుతారు. కలుపు మొక్కలు లేకుండా చూసి నాలుగైదు రోజులకోసారి నీటిని అందిస్తారు. అలాగే పంట సాగుకు ముందు పశువుల పేడ వంటి సేంద్రియ ఎరువులు వేసి, పూత, పిందె దశలో కొద్దిపాటి రసాయన ఎరువులు వేస్తారు.

సమీప పట్టణాల్లో విక్రయం

మార్చి మొదటి వారం నుంచి మ్యాడంపెల్లి దోసకాయలు మార్కెట్‌కు వస్తుంటాయి. కాయలు తాజాగా ఉండేందుకు రోజూ ఉదయం 7 గంటల లోపు తెంపుకుని జగిత్యాల, కరీంనగర్, మల్యాల, గొల్లపల్లి, ఇతర సమీప గ్రామాలకు టీవీఎస్ మోటార్ సైకిళ్లు, సైకిళ్లపై వెళ్లి విక్రయిస్తుంటారు. కాయల నాణ్యతను బట్టి ప్రస్తుతం కిలో రూ. 70-80 వరకు పలుకుతుంది. ఒక్కొక్కరు తోటలోని కాయలను బట్టి 40 కిలోల వరకు రోజు విడిచి రోజు మార్కెట్‌కు తీసుకువస్తారు. కాయలు, మార్కెట్ ధరలను బట్టి రూ.1,500 నుంచి రూ.2 వేల వరకు ఒక్కో రోజు సంపాదిస్తుంటారు.

ఆ పంట గ్రామస్తులకు పవిత్రం

దోసకాయల పంట మ్యాడంపల్లి గ్రామస్తులకు పవిత్రం. స్నానం చేయకుండా తోటలోకి ఎవరినీ రానీయరు, వారు సైతం వెళ్లరు. అన్ని యాజమాన్య పద్ధతులు పాటిస్తే 10 గుంటల్లో సీజన్ ముగిసే వరకు దాదాపు 15 క్వింటాళ్ల కాయ వస్తుందని, రూ.30- 50 వేల వరకు సంపాదించే అవకాశం ఉంది. రైతులే స్వయంగా పనులు చేసుకుంటుండడంతో ఖర్చు కేవలం రూ.5 వేల లోపే ఉంటుంది. ఈ గ్రామస్తుల స్ఫూర్తితో సమీప గ్రామాలైన తక్కళ్లపల్లి, సుద్దపల్లి, రాఘవపట్నం గ్రామాల రైతులు సైతం దోసకాయ సాగుకు ఉపక్రమిస్తుండటం విశేషం.

దోసకాయల ఊరుగా పేరు..



మా ఊర్లోనే దోసకాయలను ఎక్కువగా సాగు చేసి దళారులకు అమ్మకుండా మేమే విక్రయిస్తాం. దీంతో మా ఊరు దోసకాయల ఊరుగా పేరు గాంచింది. మార్కెట్‌లో ఉన్న డిమాండ్‌ను బట్టి ఇతర పంటలతో పోల్చితే తక్కువ కాలంలో మంచి ఆదాయం వస్తుంది. – అల్లె శంకరయ్య, రైతు

జగిత్యాల, కరీంనగర్‌లో..



చాలా మంది మా ఊరోళ్లు దోసకాయ పెట్టడంతో ఎక్కడ డిమాండ్ ఉంటే అక్కడకు వెళ్తాం. ఈ సారి చాలా మంది కొత్త రైతులు దోస సాగు చేశారు. దీంతో జగిత్యాల పట్టణంతో పాటు కరీంనగర్ నగరానికి వెళ్లి అమ్ముకుంటాం.

– తునికి శ్రీనివాస్, రైతు

తాజాగా ఉండటంతో..



మా ఊరి దోసకాయలు తాజాగా ఉండటంతో వినియోగదారులు వెంటనే కొంటారు. ఎండలు ఎక్కువైన కొద్ది దోసకాయలు ఎక్కువగా అమ్ముడుపోతాయి. దోస విత్తనాలు నాటినప్పటి నుంచి అమ్మకం వరకు పంటను జాగ్రత్తగా చూసుకుంటాం.

– నిమ్మ నర్సయ్య, రైతు

ఎనిమిదేళ్లలో రైతులకు చేసింది శూన్యం

- డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మణ్‌కుమార్

వెల్గటూర్(ధర్మపురి): ఎనిమిదేళ్లలో స్థానిక మంత్రి రైతులకు చేసింది శూన్యమని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో మేడారం రైతులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మేడారంలో డీ-83బీ కాల్వ నిర్మాణ పనుల కోసం చేస్తున్న బ్లాస్టింగ్‌ల వల్ల రైతుల బావుల్లో బండలు పడుతున్నాయని, పూతకు వచ్చిన మామిడి చెట్లు విరిగిపోతున్నాయని, నష్ట పరిహారం ఇవ్వాలని కలెక్టర్‌కు రైతులు ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు. సమస్యపై రెండు నెలలుగా మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు పలుసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. దీంతో తానే రైతుల పక్షాన ప్రజావాణిలో కలెక్టర్ ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోయిన రైతుల కోసం పోరాటం చేస్తుంటే, ఓర్వలేక రైతులను రెచ్చగొట్టి రాజకీయం చేస్తున్నారన్నారు. 2004 నుంచి ఈ ప్రాంతానికి ప్రాతినిధ్యం వహిస్తూ ఇక్కడి నీళ్లను సిద్దిపేట, గజ్వేల్‌కు తరలిస్తుంటే ఆపలేదని, రూ.20 లక్షల విలువ చేసే భూములకు రూ.9 లక్షల పరిహారం ఇచ్చి రైతులకు అన్యాయం చేశారని, 8 ఏళ్లుగా అధికారంలో ఉండి కూడా ఇప్పటికీ పూర్తి స్థాయిలో పరిహారం అందించలేదన్నారు. ఇప్పటికైనా ముంపు గ్రామాల రైతులకు న్యాయం చేసి వారిని ఆదుకోవాలని కోరారు. సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, ముత్తునూర్ ఎంపీటీసీ మంజుల, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్ రావు, మండల అధ్యక్షుడు రమేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు ఒడిశా కార్మికుడు మృతి

కొత్తపల్లి(కరీంనగర్): మండలంలోని ఖాజీపూర్ గ్రామ పంచాయతీ పరిధి ఐలవోనిపల్లి హామ్లెట్ శివారులో బుధవారం ప్రమాదవశాత్తు ఒడిశా కార్మికుడు మృతిచెందాడు. ఎస్సై ఎల్లయ్యగౌడ్ వివరాల మేరకు.. ఒడిశా రాష్ట్రం మయూర్‌గంజ్ జిల్లా జరియా గ్రామానికి చెందిన అగస్త్య ముర్ము(33), రమేష్ ముర్ము రెండు నెలలుగా ఓ టేకేదార్ ద్వారా ఐలవోనిపల్లి శివారులోని ఓ గ్రానైట్ కంపెనీలో కూలీగా పనిచేస్తున్నారు. మంగళవారం అగస్త్య ముర్ము(33) బయటకు వెళ్లొస్తానని చెప్పి తిరిగి రాలేదు. టేకేదార్‌తో కలిసి రమేష్ ముర్ము వెతుకుతుండగా గ్రామ శివారులోని ఓ వ్యవసాయ బావి సమీపంలో అగస్త్య ముర్ము మృతదేహాన్ని గుర్తించారు. వ్యవసాయ బావిలో దిగి స్నానం చేసి బయటకు వచ్చి బట్టలు మార్చుకునే క్రమంలో ప్రమాదవశాత్తు బొక్కబోర్ల పడి ముక్కుకు బలమైన గాయం కావడంతో తన సోదరుడు చనిపోయాడని, అతడి మరణంపై ఎలాంటి అనుమానాలు లేవంటూ తమ్ముడు రమేష్ ముర్ము ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కరెంట్ షాక్‌తో ఒకరు..

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ భాగ్యనగర్‌లోని ఎస్ఎస్‌మార్ట్ సూపర్‌మార్కెట్లో పనిచేస్తున్న ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు కరెంట్ షాక్‌తో మృతిచెందాడు. టూ టౌన్ పోలీసుల వివరాలు.. బిహార్‌కు రాష్ట్రం ఈస్ట్ చంపారన్ జిల్లా రాయపట్టి గ్రామానికి చెందిన అర్జున్ కుమార్(19) ఎస్ఎస్‌మార్ట్ సూపర్‌మార్కెట్‌లో పనిచేస్తున్నాడు. బుధవారం ఉదయం సూపర్ మార్కెట్ భవనం ముందు భాగంలో శుభ్రం చేస్తుండగా ప్రమాదవశాత్తు అర్జున్‌కుమార్ చేతిలోని చీపురు రాడ్ కరెంటు తీగకు తగిలి ఒక్కసారిగా షాక్‌కు గురై కిందపడిపోయాడు. వెంటనే గమనించిన సూపర్ మార్కెట్ సిబ్బంది అతన్ని పరీక్షించగా అప్పటికే మృతిచెందాడు. మృతుడి సోదరుడు జయరాంకుమార్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ లక్ష్మీబాబు తెలిపారు.

యువతి బలవన్మరణం

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లి మండలం బద్దిపల్లి గ్రామానికి చెందిన గంగిపెల్లి శివాణి (23) ఉద్యోగం రాలేదన్న బెంగతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై ఎల్లయ్యగౌడ్ వివరాల మేరకు.. ఎంబీఏ విద్యనభ్యసించిన శివాణి ఉద్యోగ ప్రయత్నంలో భాగంగా హైదరాబాద్‌లో కోచింగ్ తీసుకుంటూ విఫలయత్నం కాగా ఆవేదనకు లోనై బద్దిపల్లికి వచ్చింది. ఉద్యోగం రాలేదన్న బెంగతో మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి నాగవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

అనారోగ్యంతో యువకుడు..

జమ్మికుంట(హుజూరాబాద్): అనారోగ్య కారణాలతో యువకుడు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్తుల వివరాలు.. మండలంలోని కోరపల్లికి చెందిన తాళ్లపెల్లి అరవింద్ (25)ఏడాది క్రితం పక్షవాతం బారినపడ్డాడు. ఆసుపత్రిలో వైద్యం చేయించుకున్నా నయం కాలేదు. దీంతో తీవ్ర మనస్తాపం చెందాడు. బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై ఇంకా కేసు నమోదు కాలేదు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరు..

కరీంనగర్‌క్రైం: కరీంనగర్‌లోని కోతిరాంపూర్‌లో గల ఒక షోరూంలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న వ్యక్తి ఉరేసుకొని మృతిచెందాడు. వన్‌టౌన్ పోలీసుల వివరాలు.. కోతిరాంపూర్‌కు చెందిన బిశాల్ షోరూంలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం ఉదయం తన రూములో తాడుతో ఉరివేసుకుని మృతిచెందాడు. ఆర్థిక ఇబ్బందులతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి బంధువు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్ సీజ్



టిప్పర్‌ను సీజ్ చేసిన అధికారులు

సారంగాపూర్(జగిత్యాల): అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్‌ను బుధవారం అటవీశాఖ అధికారులు సీజ్ చేసి, ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. పోతారం, బట్టపల్లి గ్రామ శివారుల నుంచి ఇటుక తయారీ కోసం టిప్పర్‌లో మట్టిని తరలిస్తుండగా అటవీశాఖ జగిత్యాల రేంజర్ ప్రణీత్‌కౌర్, సెక్షన్ అధికారి మహేష్ టిప్పర్‌ను సీజ్‌చేసి కల్లెడ ఫారెస్ట్ డిపోకు తరలించారు. పోతారం శివారు గ్రామం గణేష్‌పల్లికి చెందిన ఇడగొట్టు సాయికృష్ణ, గొల్లపల్లికి చెందిన తపల్ల శ్రీహరిపై కేసు నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు. అటవీశాఖ అధికారుల వెంట బీట్ అధికారులు గోపాల్, రవీందర్ ఉన్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

మల్యాల(చొప్పదండి): ఉపాధి కోసం వచ్చిన వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని నూకపల్లిలో జరిగింది. ఎస్సై చిరంజీవి కథనం ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు గ్రామానికి చెందిన ఒర్సు బంగారయ్య(50) కొద్దిరోజుల క్రితం భార్య లక్ష్మితో కలిసి ఉపాధి కోసం మండలంలోని నూకపల్లి శివారులో అర్బన్ హౌసింగ్ డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణ పనుల కోసం వచ్చారు. బంగారయ్య నైట్‌వాచ్‌మెన్‌గా, లక్ష్మి కూలీ పనిచేస్తోంది. బంగారయ్య తాగుడుకు బానిసయ్యాడు. ఈనెల 19న భార్య నాగర్‌కర్నూల్ వెళ్లింది. మద్యానికి డబ్బులు లేక ఈనెల 21న డబుల్ బెడ్ ఇళ్ల మధ్య ఉన్న నీళ్ల డ్రమ్ము అమ్ముకునేందుకు తీసుకెళ్తుండగా సూపర్‌వైజర్ వంశీధర్ చూశాడు. 'డ్రమ్ము ఎందుకు దొంగతనం చేస్తున్నావంటూ నిలదీయడంతో పాటు కొద్దిరోజులుగా సామగ్రి పోతోంది.. అన్నీ నువ్వే దొంగతనం చేస్తున్నావు ఆఫీస్‌లో ఫిర్యాదు చేస్తా' అని బెదిరించాడు. దీంతో తన ఉపాధి పోవడంతోపాటు దొంగగా ముద్ర పడుతుందని మనస్తాపం చెంది ఈనెల 21న ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

స్త్రీనిధి, సెర్ప్ బ్యాంక్ లింకేజీ లక్ష్యాలు పూర్తి చేయాలి

- వీసీలో ప్రత్యేక కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా



కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ యాస్మిన్‌బాషా

జగిత్యాల: స్త్రీనిధి, సెర్ప్ బ్యాంక్ లింకేజీ లక్ష్యాలు పూర్తి చేయాలని, ఈ ఆర్థిక సంవత్సరంలో ఎన్పీఏ లేకుండా చూడాలని ప్రత్యేక కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా అన్నారు. బుధవారం జిల్లాల కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో సోషల్ ఆడిట్ పారదర్శకంగా నిర్వహించి పెండింగ్ లేకుండా చూడాలన్నారు. గ్రామాభివృద్ధి సంస్థ సెర్ప్ సిబ్బంది మొండి బకాయిలపై ప్రత్యేక శ్రద్ధ వహించి రుణాలను వసూలు చేసి లక్ష్యాలు చేరుకోవాలని, అందుకు పక్కా ప్రణాళికతో ముందుకెళ్లాలన్నారు. పెండింగ్‌లో ఏమీ ఉంచకూడదని, ముఖ్యంగా మహిళల సాధికారత కోసం స్త్రీనిధి, సెర్ప్ లింకేజీ లక్ష్యాలను చేరుకోవాలని, అలాగే వసూళ్ల కూడా చేయడంలో ముందంజలో ఉండాలన్నారు. అనంతరం కలెక్టర్ యాస్మిన్‌బాషా మాట్లాడుతూ, స్త్రీనిధి రుణ లక్ష్యాలను చేరుకున్నామని, ఎన్పీఏ లేకుండా చూస్తామన్నారు. కాన్ఫరెన్స్‌లో డీఆర్డీఏ పీడీ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

షర్మిలపై అక్రమ కేసు ఎత్తివేయాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మల్యాల(చొప్పదండి): రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటన స్వేచ్ఛను రాష్ట్ర ప్రభుత్వం హరిస్తోందని, ప్రశ్నించే గొంతులను అణచివేస్తోందని వైఎస్సార్‌టీపీ చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి తడగొండ సత్యరాజ్‌వర్మ, పార్టీ జిల్లా అధ్యక్షురాలు గాదె స్రవంతి అన్నారు. వైఎస్సార్‌టీపీ అధినేత్రి షర్మిలపై అక్రమంగా పెట్టిన కేసు ఎత్తి వేయాలని కోరుతూ బుధవారం డిప్యూటీ తహసీల్దార్ అరుణ్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ, షర్మిల పాదయాత్రను అడ్డుకుని, అవమానించడాన్ని, అక్రమంగా కేసు పెట్టడాన్ని తీవ్రంగా ఖండించారు. హైకోర్టు అనుమతి తీసుకుని పాదయాత్ర చేపట్టినా అడ్డుకోవడం చూస్తుంటే సీఎం కేసీఆర్ పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోందనడానికి నిదర్శనమన్నారు. రాష్ట్రంలో ప్రజల తరపున మాట్లాడే వారిని, ప్రశ్నించే వారిని అణగదొక్కుతున్నారని ధ్వజమెత్తారు. తక్షణమే అక్రమంగా పెట్టిన కేసును ఉపసంహరించుకోవడంతోపాటు, పాదయాత్ర సజావుగా సాగేందుకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు పాదం శంకరయ్య పటేల్, జోగు భూమరాజ్, గాదె శ్రీనివాస్, లంక శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ముత్యంపేట నుంచి కొండగట్టుకు పాదయాత్ర



పాదయాత్రగా వెళ్తున్న ముత్యంపేట గ్రామస్తులు

మల్యాల(చొప్పదండి): కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి సీఎం కేసీఆర్ నిధులు మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం మండలంలోని ముత్యంపేట గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో కొండగట్టు ఆలయం వరకు సర్పంచ్ బద్దం తిరుపతిరెడ్డి, గ్రామస్తులు, బీఆర్ఎస్ నాయకులు పాదయాత్ర చేపట్టారు. వందలాదిమంది నాయకులు, హనుమాన్ భక్తులు, ప్రజలు పాదయాత్రలో పాల్గొని కొండగట్టు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మ్యాక లక్ష్మణ్, ఉప సర్పంచ్ త్రినాథ్, వివిధ కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అంజన్నస్వామికి ముడుపు

కొండగట్టు(చొప్పదండి): అంజన్న ఆలయ అభివృద్ధికి సీఎం కేసీఆర్ నిధులు ప్రకటించిన నేపథ్యంలో ముత్యంపేట సర్పంచ్ తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు, నాయకులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభివృద్ధి పనులు ఎలాంటి ఆటంకాలు లేకుండా జరగాలని స్వామివారికి ముడుపుకట్టారు.

జీవాల సంరక్షణకు నట్టల నివారణ మందులు

- ఈనెల 22 నుంచి 28 వరకు ప్రత్యేక కార్యక్రమం



గొర్రెలకు నట్టల నివారణ మందులు తాగిస్తున్న దృశ్యం

జగిత్యాలఅగ్రికల్చర్: గొర్రెలు, మేకల సంరక్షణకు ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. ఈ నేపథ్యంలో జీవాలకు రోగాలు సోకకుండా ఉచితంగా నట్టల నివారణ మందులు పంపిణీ చేస్తుంది. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశు వైద్య సిబ్బంది బృందాలుగా ఏర్పడి నట్టల నివారణ మందులను జీవాలకు తాగిస్తున్నారు. జిల్లాలో 6.01 లక్షలు గొర్రెలు, 0.97 లక్షల మేకలు ఉన్నాయి. జిల్లాలో నట్టల నివారణ మందులను జీవాలకు తాగించేందుకు ఈనెల 22 నుంచి 28 వరకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. 48 బృందాలను ఏర్పాటు చేశారు. ఒక్కో పశు వైద్య బృందంలో పశు వైద్య సహాయకుడితో పాటు అటెండర్ ఉంటారు. ఈ బృందం రోజుకు కనీసం 3-4 వేల జీవాలకు నట్టల నివారణ మందును తాగించాల్సి ఉంటుంది. మండలంలోని పశువైద్యాధికారి ఆయా బృందాలను పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఏదైన గ్రామంలో ఎక్కువగా జీవాలు ఉంటే, ఆ మండలంలోని అన్ని బృందాలు అక్కడే క్యాంపు వేసి జీవాలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేస్తారు. పశు వైద్య సిబ్బంది వెళ్లే ఒక్క రోజు ముందు ఏ గ్రామానికి వెళ్తున్నారో డప్పు చాటింపు వేయిస్తున్నారు. దీంతో, గొర్రెల కాపరులు ఆ రోజు మేతకు తీసుకెళ్లకుండా నట్టల నివారణ మందులు తాగించాలని సూచిస్తున్నారు. పశువైద్య బృందం ఒక గొర్రెల మంద తర్వాత మరో గొర్రెల మంద వద్దకు వెళ్లి, జీవాల శరీరాన్ని బట్టి నట్టల నివారణ మందులు స్వయంగా తాగిస్తున్నారు.

దమ్ముంటే కరీంనగర్ నుంచి పోటీ చేయండి

- ఓవైసీలకు అప్సర్‌పాషా సవాల్



మాట్లాడుతున్న అప్సర్‌పాషా

విద్యానగర్(కరీంనగర్): దమ్ము, ధైర్యం ఉంటే అక్బరుద్దీన్ ఓవైసీ లేదా అసదుద్దీన్ ఓవైసీ అయినా కరీంనగర్ అసెంబ్లీ నుంచి పోటీ చేయాలని బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు అప్సర్‌పాషా సవాల్ విసిరారు. బుధవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో మాట్లాడారు. ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు అమ్ముడుపోయే ఎంఐఎం పార్టీ దమ్ముంటే రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒంటరిగా పోటీ చేయాలన్నారు. అధికార పార్టీ అండదండలతో చట్ట వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న ఎంఐఎంను ఎన్నికల్లో తరిమికొడతామన్నారు. నిజాం రజాకర్ వారసుల మాదిరిగానే ఎంఐఎం శ్రేణులు వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. మైనార్టీల సంక్షేమం, అభివృద్ధి కోసం కాకుండా సొంత ఎజెండాతో రాజకీయాలు చేస్తున్నారని, అందుకు నిదర్శనమే ఇటీవల ఆ పార్టీ నాయకులు కరీంనగర్‌లో చేసిన వ్యాఖ్యలు అన్నారు. మైనార్టీల ఓట్లతో పబ్బం గడుపుకోవడం, రాజకీయ అవసరాలు తీర్చుకోవడం తప్ప ముస్లిం సమాజానికి ఇన్నేళ్లుగా ఒరగబెట్టింది ఏమీ లేదన్నారు. ఎంఐఎం నేతల మాటల గారడీని మైనార్టీ సమాజం నమ్మే పరిస్థితిలో లేదన్నారు. కరీంనగర్‌లో ఎక్కువగా ఊహించుకుంటున్న ఎంఐఎం నాయకులకు కర్రు కాల్చి వాతపెట్టే సమయం ఆసన్నమైందన్నారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు మీర్ యాకూబ్ అలీ, మొహమ్మద్ మజీబ్, జిల్లా అధ్యక్షుడు మొహమ్మద్ సమీ పర్వేజ్, మైనార్టీ మోర్చా నాయకులు బల్బీర్ సింగ్, ఈయనత్ అలీ, మొహమ్మద్ సమీ, హఫీజ్, సాబీర్, అహ్మద్, ఫయాజ్, అల్తాఫ్, షహజాద్, సైద్, అయ్యూబ్ తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాల ఘర్షణ

మెట్‌పల్లి(కోరుట్ల): పట్టణంలోని మఠంవాడలో ఇరు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణలో పలువురికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. పానుగంటి ప్రసాద్ బుధవారం ఉదయం తమ ఇంటి ఆవరణలో వాహనాన్ని పార్కింగ్ చేస్తుండగా, పక్కన ఉండే నేమూరి లక్ష్మీనారాయణ అభ్యంతరం వ్యక్తం చేశాడు. ఈ నేపథ్యంలో ఇరువురి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈక్రమంలో లక్ష్మీనారాయణతో పాటు అతడి కుటుంబ సభ్యులు నడ్పి నర్సయ్య, వంశీ, భూమయ్య, బాలకృష్ణ కర్రలతో ప్రసాద్, అతడి కుటుంబ సభ్యులు శేఖర్, సరితలపై దాడికి పాల్పడ్డారు. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన ముగ్గురిని మొదట స్థానిక ప్రభుత్వాసుపత్రికి, తర్వాత మెరుగైన చికిత్స కోసం జగిత్యాలకు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్యామ్‌రాజ్ తెలిపారు.

ఏటీఎం బ్యాటరీల దొంగలు అరెస్టు

సుల్తానాబాద్‌రూరల్: పట్టణంలోని ఎస్‌బీఐ(శాస్త్రీనగర్) బ్రాంచ్ ఏటీఎంలో బ్యాటరీలను దొంగలించిన నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ఉపేందర్‌రావు తెలిపారు. మండలంలోని కాట్నపల్లి వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా ఎలిగేడు మండలం నర్సాపూర్‌కు చెందిన సుంక శ్యాం, అశోక్, కాట్నపల్లికి చెందిన గంగుల శ్రావణ్ అనుమానాస్పదంగా కనిపించారు. వారిని ఆపి విచారణ చేపట్టగా బ్యాటరీలను విక్రయించేందుకు వెళ్తున్నట్లు తేలింది. మొదటగా నాలుగు బ్యాటరీలను కరీంనగర్‌లోని ఓ స్క్రాప్ దుకాణంలో విక్రయించారని, మరో రెండు ఆటోలో తరలిస్తూ పట్టుబడ్డారు. సుంక శ్యాం ఓ బ్యాటరీ కంపెనీలో ఆన్‌లైన్ సర్వీస్ సేవలు నిర్వహించేవాడని, ఏటీఎంలలో, పెట్రోల్ పంపుల్లో అమర్చే అనుభవంతో సులభంగా దొంగలించేందుకు మరో ఇద్దరి సహాయం తీసుకున్నట్లు గుర్తించామని పేర్కొన్నారు. నిందితులను పట్టుకోవడంలో చురుకుగా వ్యవహరించిన ఏఎస్సై, కానిస్టేబుల్‌ను అభినందించారు.